# స్ఫూర్తిదాయకంగా జరిగిన గుంటూరుజిల్లా రైతు, కూలీ - కార్మిక సమ్మేళనం







**గుంటూరులో రైతు, కూలీ, కార్మికుల ప్రదర్శన; విజ్ఞాన మందిరంలో గుంటూరుజిల్లా రైతు, కూలీ, కార్మిక సమ్మేళనంలో ప్రసంగిస్తున్న కా॥ విజయకుమార్**

**గుంటూరు, 8-7-17 :**

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.), ఏఐఎఫ్‌టియు (న్యూ) గుంటూరుజిల్లా శాఖలు సంయుక్తంగా 2017 జులై 8న గుంటూరు - వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రైతు, కూలీ - కార్మిక సమ్మేళనాన్ని నిర్వహించాయి. మధ్యాహ్నం 12 గంటలకు ప్రజా కళాకారుల ఉత్తేజ భరితమైన విప్లవ గీతాలతో సమ్మేళనం ప్రారంభమైంది.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ సింహాద్రి లక్ష్మారెడ్డి సమ్మేళనం అధ్యక్షులను, ఉపన్యాసకులను వేదికపైకి ఆహ్వానించారు. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గసభ్యులు కామ్రేడ్ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు ఈ సమ్మేళనానికి అధ్యక్షత వహించారు.

రైతు, కూలీ - కార్మిక సమ్మేళనాన్ని ప్రారంభిస్తూ ఏఐఎఫ్‌టియు(న్యూ) జాతీయ అధ్యక్షులు కా॥ గుర్రం విజయకుమార్ ప్రస్తుత దేశీయ, అంతర్జాతీయ రాజకీయాలు, పాలకవర్గాలు, పాలకుల వర్గదోపిడీని ప్రస్తుత దోపిడీ సమాజాన్ని మార్చుకోవలసిన ఆవశ్యకతను వివరించారు.

సామ్రాజ్యవాదుల విదేశీ పెట్టుబడి వ్యవసాయ, పారిశ్రామికరంగాలలో వేళ్ళూనుకొని వుందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థను పరాధీనతవైపు నడిపిస్తున్నదని, నేడు పాలకులు మరింతగా సామ్రాజ్యవాదులకు సాగిలపడుతూ తమ దళారీ స్వభావాన్ని అత్యంత నగ్నంగా చాటుకుంటున్నారని అన్నారు.

విదేశీ పెట్టుబడిలేనిదే దేశం అభివృద్ధిచెందదని, దేశాభివృద్ధికి విదేశీ పెట్టుబడే శరణ్యమని దేశ ప్రధాని మొదలు రాష్ట్రాల ముఖ్యమంత్రుల వరకు విదేశీ బడా పెట్టుబడిదారులకు ఎర్ర తివాచీ పరచి స్వాగతద్వారాలు తెరుస్తున్నారని, దేశంలోని గనులు మొదలు సకల సహజ సంపదలను, మేథో వనరులను, శ్రామికశక్తిని విదేశీ పెట్టుబడికి ధారాదత్తం చేస్తూ తమ దళారీ స్వభావాన్ని అత్యంత నిస్సిగ్గుగా చాటుకుంటున్నారని అన్నారు.

సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల సేవలో తరించడానికే భారత పాలకవర్గాలు ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో మనదేశంలో వస్తుసేవల పన్ను (జిఎస్‌టి) విధానాన్ని ప్రవేశపెట్టారని, దానివల్ల చిన్న, మధ్యతరహా వ్యాపారస్తులు, చిన్న పరిశ్రమలు తీవ్రంగా నష్టపోతాయని, వ్యాపారంలో గుత్తాధిపత్యం పెరిగి లక్షలాదిమంది ఉపాధి, ఉద్యోగాలు కోల్పోతారని అంతేకాకుండా వస్తు సేవల ధరలు పెరుగుతాయని తద్వారా వినియోగం తగ్గి, ఉత్పత్తి కుంటుపడి, ఆర్థిక వ్యవస్థ పెను సంక్షోభానికి దారితీస్తుందని, ఇది దేశ ప్రజల జీవితాలను కష్టాలవైపు నెడుతుందని, కనుక పాలకుల దోపిడి విధానాలను సంఘటితంగా ఎదుర్కోవలసిన ఆవశ్యకత నేడు మరింతగా పెరిగిందని అన్నారు.

పెద్దనోట్ల రద్దుకు ప్రధాని నరేంద్రమోడీ చెప్పిన నాలుగు కారణాలు ప్రజలను మోసగించడానికేనని అన్నారు. అవినీతి అంతం, ఉగ్రవాదులను అదుపు చేయటం, నల్లధనం వెలికితీత, దొంగనోట్ల కట్టడి అనే నాలుగు అంశాలు వాటి ప్రయోజనాలు నోట్లరద్దు ద్వారా పరిష్కారం అయ్యేవికావని, వాటికి మూలాలు వ్యవస్థలోనే వున్నాయని, పాలకులు వ్యవస్థను యథాతథ స్థితిలోనే వుంచదలచారని అన్నారు.

పెద్దనోట్ల రద్దు వెనుక సామ్రాజ్యవాద డబ్బు చెల్లింపు సంస్థల ప్రయోజనాలు, లాభాలు యిమిడి వున్నాయని, దేశ ప్రజలను క్యాష్‌లెస్ (నగదురహిత) సమాజంవైపు నడిపించడానికి, తద్వారా వేల కోట్ల రూపాయల లాభాలను దండుకోవడానికి సామ్రాజ్యవాద డబ్బు చెల్లింపు సంస్థలు మనదేశ దళారీ పాలకులను ఆదేశించాయని, ఆ ఆజ్ఞానుసారమే నోట్ల రద్దు చర్యకు పూనుకుని దేశ ఆర్థికవ్యవస్థ నడ్డి విరిచారని, ఇది దేశ ప్రజలపై పాలకవర్గం జరిపిన ఎకనమిక్ సర్జికల్‌స్ట్రైక్ అని అభివర్ణించారు. బడా పెట్టుబడిదారులు బ్యాంకులకు ఎగ్గొట్టిన 7.50 లక్షల కోట్ల రూపాయల రుణాలను పారుబాకీల కింద జమకట్టి రద్దుచేశారని, దానితో దివాలాతీసిన బ్యాంకులను గట్టెక్కించటానికి ప్రజల కష్టార్జితాన్ని బ్యాంకుల్లో జమచేయించారని అన్నారు.

వ్యవసాయరంగంలో సామ్రాజ్యవాదుల చొరబాటు, దోపిడీ ఫలితంగా వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభానికి గురయి రైతాంగ ప్రజల ఆత్మహత్యల పరంపర కొనసాగుతుందన్నారు. ప్రస్తుతమున్న అర్ధవలస – అర్ధభూస్వామ్య వ్యవస్థలో ప్రజల ఏ ఒక్క సమస్యా పరిష్కారం కావని, ఈ వ్యవస్థను మార్చుకునే వైపుగా ప్రజా పోరాటాలను ఎక్కుపెట్టాలని, అందుకు కార్మికులు, కర్షకులు ఐక్యంగా అన్నివర్గాల పీడిత తాడిత ప్రజలను కలుపుకుని ఉద్యమించాలని అందుకు ఈ సమ్మేళనం దోహదపడుతుందని ఆశిస్తూ కా॥ విజయకుమార్ తన ప్రసంగాన్ని ముగించారు.

రాష్ట్ర హైకోర్టు న్యాయవాది డా॥ ఏ. రఘుకుమార్ మాట్లాడుతూ న్యాయస్థానాలు విదేశీ పెట్టుబడి దారులకు అనుకూలంగానే తీర్పులు యిస్తున్నాయని, పాలకుల విధానాలు ప్రజా వ్యతిరేకమైనవి అయినప్పటికీ వానిని సమర్ధిస్తూనే న్యాయస్థానాలు తమ తీర్పులను వెలువరించడం బాధాకరమని, 240 రోజులు పనిచేస్తే కార్మికులను రెగ్యులరైజ్ చేయడానికి న్యాయస్థానాల ద్వారా చట్టాలు ఒకనాడు కార్మికులకు అనుకూలంగా వుండేవని కానీ నేడు 2400 రోజులు కాదు కదా జీవితకాలం పనిచేసినప్పటికీ రెగ్యులరైజ్ చేసే పరిస్థితి లేదని పాలకులు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాల కనుగుణంగానే న్యాయస్థానాలు తమ చట్టాలను సవరిస్తూ తీర్పులు వెలువరిస్తున్నాయని అన్నారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కోశాధికారి కా॥ డి.వి.ఎన్. స్వామి మాట్లాడుతూ మిర్చియార్డులో కార్మికులు 5 వేలమంది వరకు వివిధ రకాల పనులు చేస్తున్నారని వీరికి ఎలాంటి హక్కులు లేకపోగా యార్డు పాలకవర్గం, కమీషన్‌దారులు కార్మికులను దొంగలను చూసినట్లు చూస్తున్నారని, పాలకవర్గం వేధింపులకు కార్మికులు గురవుతున్నారని అన్నారు. సున్నంమిల్లులు, బట్టీలలో కార్మికులు 24 గంటలు పనిచేస్తూ ఎలాంటి హక్కులు లేకుండా శ్రమశక్తి దోపిడీకి గురవుతున్నారని అన్నారు.

పాలకులు మేక్ ఇన్ ఇండియా పేరుతో సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు బ్రహ్మాండమైన రాయితీలు యిచ్చి స్వాగతిస్తున్నారని అయితే దేశంలో మూలనపడిన దేశీయ పరిశ్రమలను తెరిపించడానికి ఎలాంటి ప్రయత్నం చేయడంలేదని ఉద్దేశ్యపూర్వకంగానే దేశీయ పరిశ్రమలను దెబ్బతీస్తూ వచ్చారని అన్నారు. రాష్ట్రంలో జూట్ పరిశ్రమలు మూతపడి వేలాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోయి బ్రతుకు అగమ్యగోచర మవుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదని అన్నారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న కార్మికులపై ప్రభుత్వాలు, యాజమాన్యం కలసి ఉక్కుపాదం మోపుతున్నారని, గుర్గావ్‌లో తమ హక్కులకోసం సంఘం పెట్టుకున్న పాపానికి హీరోహోండా యాజమాన్యం కార్మికులపై తీవ్రమైన అణచివేతకు పాల్పడిందని శిక్షలు విధించి కార్మికులను సంవత్సరాల తరబడి జైళ్ళలో నిర్బంధించారని, ఇది పాలకులు ఏవిధంగా సామ్రాజ్యవాద పెట్టుబడికి కాపలాదారులుగా వున్నారో అర్ధం చేయిస్తుందని అన్నారు. కనుక వ్యవసాయరంగ ప్రజలు, పారిశ్రామిక కార్మికులు, అసంఘటితరంగ కార్మికులు ఒక త్రాటిపై ఉద్యమించి కార్మిక – కర్షక ఐక్యతను చాటాలని అందుకు ఈ సమ్మేళనం ఉపయోగపడాలని కోరుతూ కా॥ స్వామి తన ప్రసంగాన్ని ముగించారు.

ఇంకా ఈ సమ్మేళనంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గసభ్యులు కా॥ యద్దనపూడి సోని, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) గుంటూరుజిల్లా కార్యదర్శి కా॥ పాటిబండ్ల కోటేశ్వరరావులు ఉపన్యసించారు.

**ప్రదర్శన**

ప్రజా కళాకారుల డప్పుల చప్పుళ్ళ మధ్య, కళాకారుల నృత్య విన్యాసాల మధ్య కోలాహలంగా వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుండి ప్రదర్శన సాయంత్రం 4 గంటలకు బయలుదేరింది. ప్రజా కళాకారులు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఏఐఎఫ్‌టియు (న్యూ) నాయకులు ముందుభాగాన నడువగా మహిళలు, పురుషులు రెండు వరుసలుగా ప్రదర్శన సాగింది. వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుండి మున్సిపల్ ఆఫీసు, జిన్నాటవర్, గుంట గ్రౌండ్, నాజ్ సెంటర్ మీదుగా ప్రదర్శన రైల్వేస్టేషన్‌కు చేరుకుంది.

ఈ సమ్మేళనానికి ముందుగా 12 వేల కరపత్రాలు 1000 పోస్టర్లు ముద్రించి జిల్లాలో విస్తృత ప్రచారం చేశారు. గ్రామాలలో, పేటలలో, కాలనీలలో, కార్మిక వాడలలో, కార్మికులు పనిచేస్తున్న మిల్లులు, బట్టీలు, మిర్చియార్డు, ఆటోస్టాండులలో కరపత్రాల పంపిణీ, సమావేశాలు నిర్వహించి సమ్మేళనం ప్రాధాన్యతను వివరించారు.

ఈ సమ్మేళనానికి పల్నాడు ప్రాంతం రెంటచింతల, పిడుగురాళ్ళ, కారంపూడి, రాజుపాలెం, వినుకొండ ఏరియా; మరియు మంగళగిరి, రేపల్లె ఏరియాలతో పాటుగా గుంటూరు నగర పేదల కాలనీలనుండి రైతు, కూలీలు, కార్మిక పేద ప్రజానీకం హాజరయ్యారు.

ooooo